

సర్వాంతర్యామి.. సదా స్మరామి

సర్వాంతర్యామి.. సదా స్మరామి అంటూ ఆ వాడపల్లి వేంకటేశ్వర స్వామిని భక్తజనం కొలిచింది. గోవింద హరి గోవిందా అంటూ మనసారా స్మరించింది.


8లో



బ్యారేజీపై రాకపోకలకు మరో 5 రోజులు బ్రేక్

కాటన్ బ్యారేజీపై మరో ఐదు రోజుల పాటు రాకపోకలు నిలిపివేయనున్నట్లు కలెక్టర్ మాధవీలత తెలిపారు.

డెల్టాలకు 8 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.65 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

గోపాలపురం ఆర్‌ఓగా శివజ్యోతి



కలెక్టర్ మాధవీలతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శివజ్యోతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ఓఎన్‌జీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్‌డీసీ)గా బాధ్యతలు చేపట్టిన కేఎల్ శివజ్యోతిని గోపాలపురం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ)గా నియమించారు. ఈ సందర్భంగా శివజ్యోతి కలెక్టర్ కె.మాధవీలతను ఆమె చాంబర్‌లో శనివారం మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఎన్నికల నిర్వహణకు నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని, దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని శివజ్యోతికి కలెక్టర్ సూచించారు. ఇప్పటి వరకూ గుంటూరు నగరపాలక సంస్థలో అదనపు కమిషనర్‌గా పని చేస్తున్న ఆమె జిల్లాకు బదిలీపై వచ్చారు. కార్యక్రమంలో ఇప్పటి వరకూ ఓఎన్‌జీసీ ఎస్‌డీసీగా విధులు నిర్వహించిన ఎం.వెంకట సుధాకర్ కూడా పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పక్కాగా చర్యలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఎన్నికల నిర్వహణకు పక్కాగా చర్యలు చేపట్టామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత అన్నారు. ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లు, పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఓటర్ల జాబితా, ఎన్నికల నిర్వహణపై బీఎల్‌ఓలకు, నియోజకవర్గ స్థాయి అధికారులకు, సిబ్బందికి, ఇతర అధికారులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 395 సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ఎన్నికల తేదీకి అనుగుణంగా చేపట్టాల్సిన వివిధ బాధ్యతలపై రూట్ మ్యాప్ సిద్ధం చేసి, ప్రణాళిక రూపొందించామని చెప్పారు. వివిధ నియోజకవర్గాల్లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, తాత్కాలిక స్ట్రాంగ్ రూములకు అనువైన భవనాలను గుర్తించామని తెలిపారు. ఓటరు ఫొటో గుర్తింపు కార్డుల ప్రింటింగ్‌కు జిల్లా నుంచి గతంలో 1,78,000, కొత్తగా 46,761 ఓటర్లకు సంబంధించిన డేటా పంపామని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, డీఆర్‌ఓ జి.నరసింహులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్‌సీసీ-ఎ సర్టిఫికెట్ పరీక్షలు



పరీక్ష రాస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

రాజానగరం: ఎన్‌సీసీ-ఎ సర్టిఫికెట్ కోసం జిల్లాలోని 8 కేంద్రాల్లో శనివారం ప్రశాంత వాతావరణంలో రాత పరీక్షలు జరిగాయని సుబేదార్ భాస్కరరెడ్డి తెలిపారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో స్థానిక విలేకరులకు ఆయన ఈ వివరాలు తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కాకినాడ, రాజవొమ్మంగి, అమలాపురం, గొల్లపాలెం, రాజమహేంద్రవరం, ఉండూరు, పెద్దాపురం, గోకవరం కేంద్రాల్లో 629 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరు కాగా, వారిలో 474 మంది బాలురు, 155 మంది బాలికలు ఉన్నారని వివరించారు. కాకినాడలోని ఎన్‌సీసీ 18ఎ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ వివేక్ సావన్ గౌడర్ ఆధ్వర్యాన ఈ పరీక్షలు జరిగాయని తెలిపారు.



ఇంటింటికీ వెళ్లి పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది



కుష్టు వ్యాధిగ్రస్తులకు వాకర్స్, స్టిక్స్ అందజేస్తున్న డాక్టర్ వసుంధర (ఫైల్)

స్పర్శ నినాదంతో సమరం

- కుష్ఠు రహిత జిల్లా సాధనే లక్ష్యం
- 13 వరకూ అవగాహన కార్యక్రమాలు
- జిల్లావ్యాప్తంగా 90 శాతం ఇళ్లలో సర్వే పూర్తి

రాజమహేంద్రవరం రూరల్: మనకు తెలియకుండానే మనలో చేరి.. మచ్చలుగా మొదలై.. పుళ్లుగా మారి.. శరీరంలోని సున్నితమైన అవయవాలకు ముప్పు తెచ్చే మహారోగం కుష్ఠు (లెప్రసీ). ఆరంభంలోనే గుర్తించి.. తగిన చికిత్స చేస్తే నయమయ్యే ఈ వ్యాధి.. నిర్లక్ష్యం చేస్తే మాత్రం.. నాడీ వ్యవస్థ, ముక్కు, గొంతులోని మృదు కణజాలానికి చేటు చేస్తుంది. కంటి చూపును దెబ్బ తీసే ప్రమాదాన్ని తెచ్చి పెడుతుంది. ఈ వ్యాధి పీడితులు స్పర్శను కోల్పోతారు. అందువలన గాయాలు తగిలినా నొప్పి తెలీదు. చివరకు వీరి చేతులు, కాళ్లలో వేళ్లు, సున్నితమైన కణజాలానికి నష్టం జరిగి, వైకల్యానికి దారి తీస్తుంది. ప్రస్తుతం ఈ వ్యాధి ప్రభావం జిల్లాలో అంతగా లేనప్పటికీ, పలు దేశాల్లో దీని వ్యాప్తి ఎక్కువగానే ఉంది. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుష్ఠు వ్యాధి నివారణకు, దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా కుష్ఠు రహిత జిల్లా సాధన దిశగా అధికార యంత్రాంగం కార్యాచరణ చేపట్టింది. 'స్పర్శ' అనే నినాదంతో జిల్లా యంత్రాంగం ఈ వ్యాధిపై సమరం సాగిస్తోంది. కుష్ఠు అంటు రోగం కాదని, సకాలంలో గుర్తించి ప్రాథమిక దశలోనే మెరుగైన చికిత్స అందిస్తే.. పూర్తి స్థాయిలో అరికట్టే అవకాశముంటుందని వైద్యులు వెల్లడిస్తున్నారు.

ఇవీ వ్యాధి లక్షణాలు

- శరీరంపై స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు మచ్చలు.
- మందమైన మెరిసే జిడ్డుగల చర్మం. ఉబ్బెత్తుగా బత్తాయి తొక్కలా మారుతుంది.
- చెవులు, వీపు, ఛాతిపై నొప్పి లేని బుడిపెలు.
- కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం.
- ముక్కు దిబ్బడ, ముక్కులో నుంచి రక్తం కారడం, కాళ్లు చేతులకు తిమ్మిర్లు.
- అరిచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం.
- చేతి, కాలి వేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం ఏర్పడటం.

ఏం చేస్తున్నారంటే..

చులకనగా చూస్తారని కొంత మంది ఈ వ్యాధి లక్షణాలను బయట పెట్టడం లేదు. దీనివల్ల వ్యాధి ముదిరిపోవడమే కాకుండా కుటుంబంలో ఇతరులకు కూడా ఇది వ్యాపించే ప్రమాదం ఉంటుంది. ఈ నేపథ్యంలో వైద్య బృందాలు ప్రతి పంచాయతీలో గ్రామ సభలు నిర్వహిస్తూ, కుష్ఠు రోగ లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. గత నెల 30న ప్రారంభమైన ఈ అవగాహన కార్యక్రమాలు ఈ నెల 13 వరకూ జరగనున్నాయి. ఇందులో భాగంగా అనుమానితులను గుర్తించి, సమీప ప్రభుత్వ ఆస్పత్రులకు తీసుకెళ్లి కుష్ఠు నిర్ధారణ పరీక్షలు చేయిస్తారు. వాస్తవానికి కుష్ఠు వ్యాధి నిర్మూలనలో భాగంగా రోగులను గుర్తించి, వారికి సకాలంలో వైద్యసేవలందించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో ఇంటింటి సర్వే చేపట్టాయి. జిల్లాలో 4.60 లక్షల కుటుంబాలుండగా, 90 శాతం ఇళ్లల్లో ఈ సర్వే పూర్తయ్యింది. ఇప్పటి వరకూ జిల్లాలో ముగ్గురు రోగులను మాత్రమే వైద్య, ఆరోగ్య శాఖ కొత్తగా గుర్తించింది. వీరితో కలిపి ఈ ఏడాది మొత్తం 118 మంది రోగులకు చికిత్స అందిస్తున్నారు. 705 డిఫార్మిటీ కేసులు (కాళ్లు, చేతులు కోల్పోయిన వారు) ఉన్నాయి. వీరిలో 640 మందికి ప్రభుత్వ పరంగా ప్రతి నెలా ఫించను అందజేస్తున్నారు. మొత్తం 705 మందికి 845 జతల మైక్రో సెల్యులర్ రబ్బర్ (ఎంసీఆర్) చెప్పులు ఈ ఏడాది అందజేశారు. వంద మంది అల్సర్ పేషెంట్లకు, 11 లెప్రసీ కాలనీల్లోని 250 మంది రోగులకు స్పర్శ కార్యక్రమం ద్వారా సెల్ఫ్ కేర్ కిట్లు పంపిణీ చేశారు. దుప్పట్లు, కంచాలు, గ్లాసులు, పండ్లు అందజేశారు. డీటీసీఓ డాక్టర్ ఎన్.వసుంధర స్వయంగా రోగులకు వాకర్స్, స్టిక్స్ సమకూర్చారు.

చికిత్స విధానం

కుష్ఠు వ్యాధి మైక్రో బాక్టీరియం లెప్రె అనే బాక్టీరియా వలన వస్తుంది. ఈ క్రిములు తుమ్మడం, దగ్గడం వలన వ్యాప్తి చెందుతాయి. వ్యాధి లక్షణాలు కనిపించేందుకు 3 నుంచి 5 సంవత్సరాలు పడుతుంది. కుష్ఠు వ్యాధి లక్షణాలు కనిపించిన వారికి రెండు పద్ధతుల్లో వైద్య సేవలు అందిస్తారు. శరీరంపై మూడు మచ్చలున్న వారికి ఆరు నెలల పాటు, ఐదు మచ్చలు పైబడి ఉన్న వారికి మల్టీ బ్యాసిలరీ (ఎంబీ) విధానంలో 12 నెలల పాటు చికిత్స అందిస్తారు. రోగులకు నెలకు అవసరమైన మందులను ఒకేసారి నేరుగా వారి ఇళ్ల వద్దనే వైద్య సిబ్బంది అందిస్తారు. సర్వేలో గుర్తించిన రోగులకు సకాలంలో చికిత్స అందించడంతో పాటు ఆ వ్యాధిపై వారికి, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తారు. వ్యాధిని సకాలంలో గుర్తిస్తే మెరుగైన చికిత్సతో నివారించే అవకాశముంది. మల్టీ డ్రగ్ థెరపీతో ఈ వ్యాధిని అరికడుతున్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ థెరపీ అందుబాటులో ఉంటుంది.

విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

జిల్లాను కుష్ఠు రహితంగా తీర్చిదిద్దేందుకు వైద్య, ఆరోగ్య శాఖ కృషి చేస్తోంది. ప్రస్తుతం గ్రామాల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి. వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వ్యాధి ఇతరులకు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు.

– డాక్టర్ ఎస్.వసుంధర, జిల్లా లెప్రసీ, టీబీ అధికారి

మానవత్వంతో స్పందించిన సీఎం

- బాధితుడి బ్రెయిన్ సర్జరీకి రూ.8 లక్షల ఆర్థిక సాయం
- మంజూరు పత్రం అందజేసిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



నూకరాజుకు రూ.8 లక్షల మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలవడంలో.. మానవత్వంతో స్పందించడంలో తనకు తానే సాటి అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి రుజువు చేసుకున్నారు. వివరాలివీ.. నిడదవోలు మండలం రావిమెట్ల గ్రామానికి చెందిన రాంగోను నూకరాజు జనరలైజ్‌డ్ డిస్టోనియా వ్యాధితో బాధ పడుతున్నాడు. అతడికి తక్షణమే బ్రెయిన్ ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. దీనికి అయ్యే ఖర్చు భరించే స్తోమత లేకపోవడంతో.. ఈ విషయాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు దృష్టికి తీసుకుని వెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే.. బాధితుడి దుస్థితిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. ఈ నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు నూకరాజుకు తిరుపతి శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రిలో డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ సర్జరీ చేసేందుకు రూ.8 లక్షలు మంజూరు చేశారు. ఆ మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు శనివారం నూకరాజుకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, రాష్ట్ర నాయకులు ముళ్లపూడి శ్రీనివాస్ కుమార్ చౌదరి, నాయకులు మిద్దే శ్రీను, కాల్దారి శ్రీను, ఉప్పులూరి రామకృష్ణ, చిట్టి ప్రసాద్, పులుమంతుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఫలితం.. త్వరితం

- 'పది' మూల్యాంకనానికి పటిష్ట ఏర్పాట్లు
- ప్రభుత్వ పరీక్షల విభాగం ఉత్తర్వులు
- వచ్చే నెల 18 నుంచి టెన్త్ పరీక్షలు
- మార్చి 31 నుంచి ఏప్రిల్ 8 వరకూ మూల్యాంకనం

రాయవరం: పదో తరగతి పరీక్షలకు సర్వం సన్నద్ధమైంది.. ఫలితాలనూ సరైన సమయానికి ఇచ్చేందుకు పటిష్ట ప్రణాళిక అమలవుతోంది. దీనికి ప్రభుత్వ పరీక్షల విభాగం ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించింది. పదో తరగతి పరీక్షలు పూర్తి కాగానే మూల్యాంకనాన్ని ప్రారంభించి, సకాలంలో ఫలితాలను ప్రకటించే విధంగా ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి షెడ్యూల్ విడుదల చేశారు. పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనానికి సంబంధించి ఇప్పటికే అసిస్టెంట్, చీఫ్ ఎగ్జామినర్ల జాబితాలను జిల్లా విద్యాశాఖ సిద్ధం చేస్తోంది.

పరీక్షల ప్రణాళిక ఇది..

పదో తరగతి పరీక్షల షెడ్యూల్‌ను ఇప్పటికే విడుదల చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. ఫస్ట్ లాంగ్వేజ్‌తో ప్రారంభమయ్యే పరీక్షలు మార్చి 27న సోషల్ పరీక్షతో ముగియనున్నాయి. సోషల్ పరీక్ష ముగియగానే మార్చి 31 నుంచి జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ప్రారంభించి, ఏప్రిల్ 8వ తేదీతో పూర్తి చేస్తారు. మూల్యాంకనాన్ని సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా పరిధి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో 386 పరీక్ష కేంద్రాల్లో పది పరీక్షలు జరుగనున్నాయి.

మూల్యాంకనం జరిగేదిలా..

పదో తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని సకాలంలో అందించేందుకు షెడ్యూల్ విడుదల చేశారు. దీని ప్రకారం ఈ నెల 12వ తేదీలోగా జిల్లా ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈఓలు ఏఈ /సీఈ/స్పెషల్ అసిస్టెంట్ల జాబితాను సిద్ధం చేసుకోవాలి. ఈ నెల 22వ తేదీలోగా డీఈఓ కార్యాలయం సబ్జెక్టు, మీడియం వారీగా మూల్యాంకన ఉపాధ్యాయులను సిద్ధం చేయాల్సి ఉంది. సీనియారిటీ ఆధారంగా మూల్యాంకనానికి హాజరయ్యే ఉపాధ్యాయుల జాబితాను ఈ నెల 29న ప్రకటిస్తారు. మార్చి 7న ఉపాధ్యాయ సంఘాల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు. మార్చి 15న అప్‌డేట్ జాబితాను తయారు చేస్తారు. మార్చి 18న ఏఈ, సీఈ, స్పెషల్ అసిస్టెంట్లుగా నియమించిన వారికి ఉత్తర్వులు అందజేస్తారు. సబ్జెక్టుల వారీగా మూల్యాంకనానికి అవసరమయ్యే ఉపాధ్యాయులతో పాటు 30 శాతం ఉపాధ్యాయులను అదనంగా నియమిస్తారు. మార్చి 19 నుంచి 26వ తేదీలోగా ఏఈ, సీఈ, స్పెషల్ అసిస్టెంట్లుగా నియమించిన ఉపాధ్యాయులకు సంబంధిత ప్రధానోపాధ్యాయుల ద్వారా ఉత్తర్వులు అందజేస్తారు. ఇదిలా ఉంటే ఉత్తర్వులకు కట్టుబడి షెడ్యూల్‌ను తప్పనిసరిగా పాటించాలి. 1:1.3 రేషియోలో ఏఈ, సీఈ, స్పెషల్ అసిస్టెంట్లను నియమించాల్సి ఉంటుంది.

పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు

జిల్లా	పరీక్ష కేంద్రాలు	రెగ్యులర్ విద్యార్థులు
కాకినాడ	137	27,856
కోనసీమ	112	18,866
తూర్పు గోదావరి	137	23,681
మొత్తం	386	70,403

ఎవరికీ మినహాయింపు ఉండదు



మూల్యాంకన విధులకు నియమితులైన వారు తప్పనిసరిగా హాజరు కావాలి. ఈ ప్రక్రియలో ఎవరికీ మినహాయింపు ఉండదు. మూల్యాంకన విధులకు హాజరయ్యే వారు కచ్చితంగా నియమ నిబంధనలు పాటించాలి.

– జి.నాగమణి, ఆర్జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి

- విద్యార్థులకు జేసీ తేజ్‌భరత్ పిలుపు
- గోదావరి బాలోత్సవం ప్రారంభం



ప్రారంభ సభలో ప్రసంగిస్తున్న జేసీ తేజ్‌భరత్



జానపద నృత్యంతో అలరిస్తున్న చిన్నారులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే గోదావరి బాలోత్సవాలు శనివారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ మాట్లాడుతూ, బాలోత్సవంలో విద్యార్థినీ విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) మాట్లాడుతూ, పిల్లలు చదువుతో పాటు, ఆట, పాటల్లో కూడా రాణించాలని అన్నారు. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న ఈ బాలోత్సవంలో వారి తల్లిదండ్రులు కూడా భాగస్వాములు కావాలని కోరారు. కొత్తగూడెం చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్షుడు వాసిరెడ్డి రమేష్‌బాబు మాట్లాడుతూ, బాలోత్సవాన్ని కొత్తగూడెం కేంద్రంగా 1991లో ప్రారంభించామన్నారు. ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ఈ ఉత్సవాలు జరుగుతున్నాయని చెప్పారు. ఆంగ్ల భాషను ఉన్నతంగా రాణించేందుకు ఉపయోగించుకోవాలని, మాతృభాషపై ప్రేమ పెంచుకోవాలని అన్నారు. తిరుమల విద్యా సంస్థల అధినేత, గోదావరి బాలోత్సవం అధ్యక్షుడు నున్న తిరుమలరావు మాట్లాడుతూ, చదువుతో పాటు, వ్యక్తిగతంగా దాగి ఉన్న సృజనాత్మకతను బాలలు వెలికి తీయాలని ఆకాంక్షించారు. అమరావతి బాలోత్సవం కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, సీసీసీ ఎండీ పంతం కొండలరావు, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అల్లు బాబీ, రాజమహేంద్రి విద్యాసంస్థల అధినేత టీకే విశ్వేశ్వరరెడ్డి, దేవరపల్లి బాలోత్సవం అధ్యక్షుడు డి.సత్యనారాయణ, యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు అరుణకుమారి, గోదావరి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి పీఎస్ఎన్ రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.తులసి కూడా ప్రసంగించారు. తొలుత ఇటీవల మృతి చెందిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీకి నివాళులర్పించారు. దివంగత దామెర్ల రామారావు, షేక్ సాబ్జీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీఎస్‌వీ కృష్ణకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ బాలోత్సవాల్లో నిర్వహించిన 18 అకడమిక్, 11 కల్చరల్ పోటీల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. అకడమిక్ విభాగంలో జూనియర్లు, సీనియర్లకు చిత్రలేఖనం, కథా రచన, వ్యాస రచన, మెమొరీ టెస్ట్, కథా విశ్లేషణ, కవితా రచన, వార్తా రచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. కల్చరల్ విభాగంలో జూనియర్లు, సీనియర్లకు జానపద నృత్యం, దేశభక్తి, అభ్యుదయ గీతాలు, క్లాసికల్ డాన్స్, విచిత్ర వేషధారణ, లఘు నాటిక, జానపద గీతాలాపన, కోలాటం, ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించారు.

18న చినజీయర్ స్వామి రాక



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి ఈ నెల 18న జిల్లాకు రానున్నారు. ఆయన చేతుల మీదుగా కోరుకొండలో పలు ఆలయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరగనున్నాయని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. అన్నవరం దేవస్థానం, ఆర్కియాలజీ తదితర శాఖల అధికారులతో దివాన్ చెరువులో ఆయన సమావేశమై, స్వామీజీ పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం మెట్ల మార్గం పునర్నిర్మాణం, శ్రీరంగనాథ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు స్వామీజీ శంకుస్థాపనలు చేస్తారన్నారు. అలాగే కోరుకొండలో కొత్తగా నిర్మించిన ఫైర్ స్టేషన్, బల్క్ మిల్క్ చిల్లింగ్ యూనిట్(బీఎంసీయూ)లను కూడా స్వామీజీ ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులకు కూడా ఎటువంటి అసౌకర్యాలూ కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఎమ్మెల్యే రాజా కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, అన్నవరం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథరాజు, డీఈ ఉదయ కుమార్, ఆర్కియాలజీ డిపార్టుమెంట్ ఏడీ తిమ్మరాజు, కోరుకొండ తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి

సర్వాంతర్యామి.. సదా స్మరామి

- భక్తులతో కిక్కిరిసిన వాడపల్లి క్షేత్రం
- రూ.35.77 లక్షల ఆదాయం

ఆత్రేయపురం: సర్వాంతర్యామి.. సదా స్మరామి అంటూ ఆ వాడపల్లి స్వామిని భక్తజనం కొలిచింది. గోవింద హరి గోవిందా అంటూ మనసారా స్మరించింది. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయం శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఉదయం స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అర్చకులు అలంకరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి గౌతమీ గోదావరిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో వేంచేసియున్న క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు. స్వామివారికి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళం, సేవలు, లడ్డూ విక్రయం, విరాళాలు, ఆన్‌లైన్ సేవల ద్వారా సుమారు రూ.35,77,736 ఆదాయం సమకూరింది. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



వెంకన్న ఆలయం వద్ద అశేష భక్తజనం

పేదల బియ్యం పక్కదారి



శ్రీరామనగరం వద్ద పట్టుకున్న పీడీఎస్ బియ్యం



అమలాపురంలో స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలతో అధికారులు

- అధికారుల దాడులు
- రేషన్ బియ్యం పట్టివేత

రాజానగరం: పేదల బియ్యం పక్కదారి పడుతుండడంతో అధికారులు విస్తృతంగా దాడులు చేస్తున్నారు. అక్రమార్కులపై కేసులు పెడుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఒకచోట, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లాలో మరోచోట ఈ బియ్యం అక్రమ రవాణా గుట్టును రట్టు చేశారు. ముందస్తు సమాచారంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రాజానగరం శివారు శ్రీరామ నగరం వద్ద జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అశోక్ లేలాండ్ ఎకోమెట్ స్టార్ వాహనాన్ని తనిఖీ చేయగా 122 బస్తాలలో 6,100 కిలోల రేషన్ (పీడీఎస్) బియ్యాన్ని గుర్తించామని రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. దీని విలువ రూ. 31.73 లక్షలుగా అంచనా వేశారు. ప్రత్తిపాడుకు చెందిన వాహన యజమాని వెలుగుల కృష్ణ, పార్టనర్ వెలుగుల గురయ్య (బాబ్జి)లు ఖమ్మం జిల్లా కల్లూరు నుంచి గొల్లప్రోలు మండలం బి.ప్రత్తిపాడుకు ఈ బియ్యాన్ని తరలిస్తున్నారు. రేషన్ కార్డులదారుల నుంచి కిలో బియ్యాన్ని రూ. 23కు కొనుగోలు చేసి, బి.ప్రతిపాడు పరిధిలోని చేపల చెరువులకు రూ.26కు విక్రయిస్తుంటారు. ఈ మేరకు వాహన డ్రైవర్ కరణం సద్గురుమూర్తి నుంచి వివరాలు తీసుకుని, డ్రైవర్‌తోపాటు ఇద్దరు రవాణాదారులపై 6ఏ కేసు నమోదు చేశారు. సీఐ నాగరాజు, డీఎస్‌ఓ భాస్కర్, రాజానగరం సీఎస్‌డీటీ సుందర్, కానిస్టేబుళ్లు లోవరాజు, కిశోర్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ సిబ్బంది పాల్గొన్నారు.

అమలాపురంలో 1,200 కిలోలు

అమలాపురం రూరల్: అమలాపురం మార్కెట్ వీధిలో రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. విశ్వసనీయ సమాచారంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులతో కలసి ఒక ఇంటిని తనిఖీ చేయగా 24 బస్తాల్లో 1,200 కిలోల బియ్యం గుర్తించారు. ఈ బియ్యం నడిపూడికి చెందిన అరిగెల వీరాంజనేయులుకు చెందినవిగా గుర్తించారు. అమలాపురం పరిసర ప్రాంతాల్లో రేషన్ కార్డుదారుల నుంచి కిలో రూ.20 చొప్పున కొనుగోలు చేసి రూ.22కు పరిసర గ్రామాలకు చెందిన చేపల చెరువులు, బజ్జీల వ్యాపారస్తులకు వీరాంజనేయులు అమ్ముతున్నాడు. నిందితుడిపై కేసు నమోదు చేశామని రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. రాజమహేంద్రవరం రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని అన్నారు. ఈ తనిఖీల్లో కార్యాలయ సీఐ నాగ వెంకటరాజు, ఎస్సైలు జగన్నాథరెడ్డి, అమలాపురం సీఎస్ డీటీ భారతి తదితరులు పాల్గొన్నారు.

బ్యారేజీపై రాకపోకలకు మరో 5 రోజులు బ్రేక్

కొనసాగుతున్న మరమ్మతులు



కాటన్ బ్యారేజీపై రోడ్డును తడుపుతున్న సిబ్బంది

ధవళేశ్వరం: స్థానిక కాటన్ బ్యారేజీపై రోడ్డు మరమ్మతుల నిమిత్తం మరో ఐదు రోజులపాటు రాకపోకలు నిలిపివేయనున్నట్లు కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. తొలుత ఈ నెల 10వ తేదీ వరకూ బ్యారేజీపై రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం కాంక్రీట్ క్యూరింగ్ నేపథ్యంలో మరో ఐదు రోజులు సమయం కావాలని ఇరిగేషన్ ఈఈ కాశీ విశ్వేశ్వరరావు విజ్ఞప్తి మేరకు గడువు పొడిగించినట్లు కలెక్టర్ వివరించారు. బ్యారేజీపై రూ.2 కోట్ల ప్రతిపాదనలతో జరుగుతున్న పనులు ప్రస్తుతం కాంక్రీట్ క్యూరింగ్ దశలో ఉన్నాయన్నారు. ప్రజలు గమనించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగించాలన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



పెద్దాపురంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న విద్యాలయ ప్రిన్సిపాల్ కమలం

పెద్దాపురం: పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 9వ తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని విద్యాలయ ప్రిన్సిపాల్ ఆర్.కమలం తెలిపారు. విద్యాలయలో ఖాళీ సీట్లకు గాను జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాల్లో పరీక్ష జరిగింది. 1,587 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 1,070 మంది హాజరయ్యారు. 517 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాలను మండల విద్యాశాఖాధికారులు శర్మ, చౌదరి, ప్రిన్సిపాల్ కమలం పరిశీలించారు.

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

తుని రూరల్: తుని మండలం తేటగుంట జంక్షన్ వద్ద లారీ ఢీకొనడంతో ఓ వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందినట్లు రూరల్ ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. శనివారం తేటగుంట గ్రామానికి చెందిన కొల్లి నారాయణమ్మ (60) జాతీయ రహదారి దాటుతుండగా ఈ ప్రమాదం జరిగినట్టు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉద్యోగులు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

కంటిపూడి గ్రూప్స్ చైర్మన్ సర్వారాయుడు



ట్రోఫీని చూపుతున్న కంటిపూడి గ్రూప్ డైరెక్టర్లు

రాజమహేంద్రవరం రూరల్/ రాజానగరం: ఉద్యోగులు ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కంటిపూడి గ్రూప్స్ చైర్మన్ కంటిపూడి సర్వారాయుడు అన్నారు. శనివారం రాజానగరంలోని కంటిపూడి కియా బాడీషాప్ వద్ద నిర్వహించిన కంటిపూడి స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వారాయుడు మాట్లాడుతూ ఉద్యోగులంతా రోజూ ఆటలతో పాటు వ్యాయామానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కంటిపూడి గ్రూప్ ప్రాతినిధ్యం వహిస్తున్న కంటిపూడి కియా మోటార్స్, కంటిపూడి నిస్సాన్, కంటిపూడి స్టీల్స్, కంటిపూడి సుజుకీ సంస్థలోని ఉద్యోగులకు రాజమహేంద్రవరం, కాకినాడ టీమ్‌లుగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, రన్నింగ్, లాంగ్‌జంప్, మ్యూజికల్ కోన్స్, లెమన్ అండ్ స్పూన్, బ్యాడ్మింటన్, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులను కంటిపూడి సర్వారాయుడు, డైరెక్టర్లు సీహెచ్‌వీవీ సత్యనారాయణ మూర్తి (చినబాబు), కె.వినయ్‌బాబు, ఎం.జగన్, కె.మన్మోహన్‌రామ్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం విజేతలను అభినందించారు.